మా కుమార్తె వివాహానికి రండి



సీఎం దంపతులకు వివాహ పత్రిక అందిస్తున్న నర్సింగరావు

కోరుట్ల/మెట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. శుక్రవారం తన సతీమణి రజినితో కలిసి హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా తమ కుమార్తె పెళ్లికి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ సీఎం దంపతులకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



జ్ఞాపిక అందిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. భూషణరావుపేటలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీలో విజేత, రన్నరప్ జట్లకు శుక్రవారం బహుమతులు పంపిణీ చేశారు. విజేత మహేందర్ జట్టుకు జ్ఞాపికలు, రూ.5 వేలు, రన్నరప్ అర్షద్ జట్టుకు జ్ఞాపికలు అందించారు. ఎంపీటీసీ సభ్యుడు కొండ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ కూన సులోచన, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్: పట్టణంలోని 5వ వార్డులో బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, నాయకులు రవి, భూమేశ్, సామల్ల సతీశ్, సింగని సతీశ్, శేఖర్, నారాయణ, గోపాల్, సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఎంపీ సంజయ్ ప్రజాహిత యాత్ర

కథలాపూర్: వేములవాడ నియోజకవర్గంలోని మేడిపెల్లి, కథలాపూర్ మండలాల్లో శనివారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర నిర్వహిస్తారని బీజేపీ జిల్లా నాయకులు ఎడ్మల వినోద్‌రెడ్డి, బద్రి సత్యం తెలిపారు. మేడిపెల్లి మండలంలో యాత్ర ప్రారంభించి అక్కడి నుంచి కథలాపూర్ మండలానికి చేరుకుంటారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పీవీకి భారతరత్నపై హర్షం

మెట్‌పల్లి: మాజీ ప్రధాని, మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ మాజీ చైర్మన్ పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం హర్షణీయమని ప్రతిష్టాన్ ప్రస్తుత చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. 1967 నుంచి 1983 వరకు ఆయన చైర్మన్‌గా పని చేశారని గుర్తు చేశారు. భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చిన వ్యక్తి అని కొనియాడారు.

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి..

మల్యాల: దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడంపై ప్యాక్స్ చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు నేరెళ్ల శ్రవణ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన సేవలు దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.

స్కూళ్లకు మెడికల్ కిట్లు



కిట్లు ఇస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

కోరుట్ల: పీఆర్టీయూ కోరుట్ల మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 10 పాఠశాలలకు కలెక్టర్ యాస్మిన్‌బాషా చేతులమీదుగా మెడికల్ కిట్లు అందించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, బోయినపల్లి ఆనందరావు, కోరుట్ల మండల అధ్యక్షుడు అబ్దుల్‌వాజిద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి సర్తాజ్ అహ్మద్, మహిళా ఉపాధ్యక్షురాలు సురేఖ పాల్గొన్నారు.

కోరుట్ల ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ నియామకం



రాజేందర్

కోరుట్ల: కాంగ్రెస్ పార్టీ కోరుట్ల సెగ్మెంట్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన ఇట్యాల రాజేందర్ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులు జీవన్‌రెడ్డి, జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత దంత వైద్యశిబిరం



కోరుట్ల: కోరుట్ల లయన్స్ క్లబ్, వినాయక్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, కుందారపు మహేందర్, సీనియర్ నాయకులు దిలీప్‌రావు, సురేష్, ప్రవీణ్, శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు

కోరుట్ల: కోరుట్లలో శనివారం నుంచి ప్రారంభం కానున్న కేపీఎల్ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు 32వ వార్డు మైనార్టీ నాయకుడు రజీయొద్దీన్ శుక్రవారం టీషర్టులు అందించారు. అల్‌ఖైర్ యూత్ సభ్యులు అబ్దుల్ రహీం, అబుబాకర్, సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



రాయికల్: ఆలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 25 మంది గురుకుల ప్రవేశ పరీక్ష రాస్తుండగా వీరికి గ్రామానికే చెందిన ఎలిపెద్ది మల్లారెడ్డి–సునీత శుక్రవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

‘జంగల్ నాలా’.. సాగునీరెలా?

- ఏళ్లుగా పూడికతీతకు నోచుకోని చెరువు
- నాలుగు గ్రామాలకు ఇదే ఆధారం
- ఏటా యాసంగి పంటల సాగుకు ఇబ్బందులు
- నెరవేరని మాజీ మంత్రి కొప్పుల హామీ
- శాశ్వత పరిష్కారం చూపాలని రైతుల వేడుకోలు



జంగల్ నాలా ప్రాజెక్టు చెరువు

వెల్గటూర్ : మండలంలోని అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు జంగల్‌నాలా. సుమారు 4,600 ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ చెరువుపై నాలుగు గ్రామాల రైతులు ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నారు. జగదేవుపేట, చందోలి, దట్నూర్ గ్రామాల మధ్య విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్టును గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా రెండు పంటలకు సాగు నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సీజన్ వస్తే చాలు ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతామని, అయినా వారు శాశ్వత పరిష్కారం చూపించడం లేదని వాపోతున్నారు.

పూడికతీతపై నిర్లక్ష్యం..

జంగల్‌నాలా ప్రాజెక్టు చెరువు పరిధిలో జగదేవుపేట, కొండాపూర్, శాఖాపూర్, పాక్షికంగా రాజక్కపల్లి గ్రామాలకు సాగు నీరందుతుంది. కానీ, ఏళ్లుగా ఇందులో పూడిక తీయకపోవడంతో చివరి ఆయకట్టుకు సరిపడా నీరందడం లేదు. గత 20 ఏళ్లు ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కాళేశ్వరం లింక్–2 నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదని రైతులు అంటున్నారు. ఆయన ఈ ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తున్నారు. యాసంగి వచ్చాక ఆయన వద్దకు వెళ్తే ఎస్సారెస్పీ నుంచి చెరువుకు నీటిని విడుదల చేయించేవారని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

‘మిషన్ కాకతీయ’ నిధులు స్వాహా?

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద జంగల్‌నాలా ప్రాజెక్టులో పూడిక తీయడానికి సుమారు రూ.1.50 కోట్లు విడుదల చేసింది. కానీ, కాంట్రాక్టర్ 10 శాతం పనులు కూడా చేయలేదని, పక్కనున్న గుట్ట నుంచి మట్టిని తీసి, చెరువు కట్టపై పోసి, నిధులన్నీ స్వాహా చేశారన్న ఆరోపణలున్నాయి. పూడిక తీయకపోవడం వల్ల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం తగ్గి, చివరి ఆయకట్టుకు సాగు నీరందక నానాతంటాలు పడుతున్నామని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా పూడిక తీయించాలని కోరుతున్నారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్లా



జంగల్‌నాలా ప్రాజెక్టు అంశాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లా. ఎస్సారెస్పీ డీ–83ఏ కెనాల్ నుంచి రంగదామునిపల్లి రిజర్వాయర్ నింపి, దానినుంచి జంగల్‌నాలా ప్రాజెక్టులో నిరంతరం నీటి స్టోరేజీ ఉండేలా చూడాలని కోరాను. అతి త్వరలో సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఘనంగా చిలుకల చిన్నమ్మ జాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మల్లాపూర్: మండలంలోని సంగెం–శ్రీరాంపూర్‌లో చిలుకల చిన్నమ్మ జాతరను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కాటిపెల్లి సరోజన–ఆదిరెడ్డి దంపతులు, డిప్యూటీ తహసీల్దార్, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి శ్రావణి, మాజీ సర్పంచ్ పాలెపు దిలీప్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

50 ఏళ్లుగా నిర్వహణ..

చిలుకల చిన్నమ్మ జాతర గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపు గ్రామాలైన సంగెం–శ్రీరాంపూర్, కుస్తాపూర్, రత్నాపూర్, నడికుడ గ్రామాల్లోని ప్రతీ ఇంటి నుంచి కుటుంబసభ్యుల్లో ఒకరు సమీప గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరిస్తారు. నదీ జలాలను తీసుకువచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేస్తారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి, అమ్మవారికి నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. ఈ అమ్మవారిని పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని, గ్రామానికి మంచి జరుగుతుందని తెలిపారు.



ఆలయంలో అమ్మవారు

‘గృహలక్ష్మి’ సర్వే పరిశీలన



ఇటిక్యాలలో సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

రాయికల్: మండలంలోని ఇటిక్యాల, రామాజీపేట గ్రామాల్లో సిబ్బంది గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపికపై సర్వే చేస్తున్నారు. సర్వే తీరును శుక్రవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. ఎల్పీజీ గ్యాస్ లబ్ధిదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఎనీమియా ముక్త్ భారత్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉన్న వారికి మందులు అందజేశారు. పౌష్టికాహారం తినాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మౌనిక, ఫార్మసిస్ట్ మాధవి, ఏఎన్‌ఎం సోని, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి పథకం



మల్లాపూర్: అర్హులందరికీ ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తుందని ఎంపీడీవో రాజశ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్, సిరిపూర్ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బందికి ఎల్పీజీ ఫీల్డ్ సర్వే మొబైల్ యాప్‌పై ఆయన అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు నరేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



నిల్వ నీటిని పారబోస్తున్న ప్రత్యేకాధికారి ప్రసాద్

ఇబ్రహీంపట్నం: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షకొండ గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. గ్రామంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీగా వెళ్తూ ఇళ్ల వద్ద నిల్వ ఉంచిన నీటిని పారబోశారు. తడి, పొడి చెత్తను చెత్త బుట్టలోనే వేయాలని గ్రామస్తులకు సూచించారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పానకంటి వెంకట్, పంచాయతీ కార్యదర్శి రాకేశ్, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు

కథలాపూర్: మండలంలో పారిశుధ్య కార్యక్రమాలు శుక్రవారం కొనసాగాయి. గ్రామాల్లో డ్రై డే నిర్వహించారు. ఇళ్లలోని ట్యాంకుల్లో నిల్వ ఉంచిన నీటిని పారబోశారు. ఎంపీడీవో జనార్దన్ ఆయా పనులను పరిశీలించారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థినులు

జగిత్యాల: విద్యార్థులు జీవితంలో స్థిరపడాలంటే పలు అంశాలపై నైపుణ్యం పెంచుకోవాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతీది నేర్చుకొని, జీవితంలో ఉన్నతంగా రాణించాలన్నారు. రిసోర్స్ పర్సన్ అబ్దుల్ వాసిద్, టాస్క్ రీజినల్ మేనేజర్ గంగప్రసాద్, కో–ఆర్డినేటర్ సత్యప్రకాశ్ తదితరులున్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చండి



ప్రిన్సిపాల్ ఆనందంను సన్మానిస్తున్న లెక్చరర్లు

మెట్‌పల్లి: విద్యార్థులు కష్టపడి చదివి, తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని మెట్‌పల్లి విద్యుత్ ఏడీఈ దురిశెట్టి మనోహర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డివిజన్ స్థాయిలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, జ్ఞాపికలు అందించారు. బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆనందం తదితర అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు

జగిత్యాలజోన్: సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత 5 రోజులుగా జాబితాపూర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహిస్తున్న సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించిన పాఠశాల యాజమాన్యానికి సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ పూర్ణచందర్, పీడీలు సుధాకర్, గంగాధర్, పీఈటీలు ప్రశాంత్, గౌతమ్ పాల్గొన్నారు.

ధర్మపురిలో సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ, బీజేవైఎం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కు వినతిపత్రం అందించారు. దోమల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, ఫాగింగ్ వంటి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పట్టణంలో కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోందని, ఎంతోమంది గాయపడ్డారని తెలిపారు. నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు లవన్‌కుమార్, పిల్లి శ్రీనివాస్, బండారి లక్ష్మణ్, బండారి సత్యనారాయణ, గాజు భాస్కర్, ఆకుల శ్రీనివాస్, దివిటి శ్రీధర్, నవీన్, గణేశ్ తదితరులున్నారు.

బీర్‌పూర్ బ్రహ్మోత్సవాలకు టెండర్లు



గుట్టపై టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 19 నుంచి మార్చి 2 వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు దేవాదాయ శాఖ అధికారులు లక్ష్మీనృసింహస్వామి గుట్టపై శుక్రవారం బహిరంగ టెండర్లు నిర్వహించారు. కొబ్బరికాయలు, బెల్లం విక్రయించుకునేందుకు రూ.2.16 లక్షలు, గండ దీపం నిర్వహణకు రూ.1.80 లక్షలు, లడ్డూ, పులిహోర విక్రయం కోసం రూ.3.35 లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.28,500, పట్టి నామాలు, కోరమీసాలు దుకాణాన్ని రూ.2.14 లక్షలకు టెండర్‌దారులు దక్కించుకున్నారని తెలిపారు. ఆలయ నిబంధనలు అతిక్రమించి, సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రమణారావు, ఉత్సవ కమిటీ సభ్యుడు ఎనగంటి సామ్రాట్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘బల్దియాలో అధ్వానంగా శానిటేషన్’

జగిత్యాలటౌన్: జగిత్యాల బల్దియాలో శానిటేషన్ అధ్వానంగా తయారైందని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య ఆరోపించారు. శుక్రవారం జరిగిన బల్దియా సాధారణ సమావేశం అనంతరం మాట్లాడారు. శానిటేషన్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై ఎన్నిసార్లు నిలదీసినా, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. వాహనాలు కొని ఏడాది కాకున్నా మరమ్మతుల పేరిట లక్షలాది రూపాయల బిల్లులు డ్రా చేస్తున్నారని ఆరోపించారు. శానిటేషన్ విభాగంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు.

పనులు ప్రారంభించాలి

జగిత్యాల బల్దియాలోని వివిధ వార్డుల్లో టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి కోరారు. శుక్రవారం సాధారణ సమావేశం అనంతరం మాట్లాడారు. బల్దియాలో ఎంత మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారన్న విషయమై అధికారులు వివరాలు దాస్తున్నారని పేర్కొన్నారు. కొత్తగా చేపట్టిన కార్మికుల నియామకంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. బినామీ పేర్లతో జీతాలు చెల్లిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని అవినీతికి అడ్డుకట్టవేయాలని కోరారు.

కుస్తాపూర్‌లో గ్రామదేవతలకు జలాభిషేకం



గోదావరి నది నుంచి బిందెల్లో నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు శుక్రవారం జలాభిషేకం చేశారు. ఇంటికొకరి చొప్పున మొగిలిపేట శివారులోని గోదావరి నదికి కాలినడకన వెళ్లి, పుణ్యస్నానం ఆచరించి, బిందెల్లో నీటిని తీసుకువచ్చారు. గ్రామదేవతలకు జలాభిషేకం చేస్తే అందరం క్షేమంగా ఉంటామని, వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండుతాయని స్థానికులు తెలిపారు. మాజీ సర్పంచ్ సరికెల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు దేవ ముత్తమ్మ, పంచాయతీ కార్యదర్శి మురళి, నాయకులు మహిపాల్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో జరుగుతున్న వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ జరపాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. వృద్ధుల ఆత్మహత్యలు– నివారణ అన్న అంశంపై శుక్రవారం జిల్లా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో కొడుకులు, కోడళ్లు, కూతుర్లు వృద్ధుల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం, హింసకు గురిచేయడం, బలవంతంగా వారి ఆస్తులను తమ పేర్లపై రాయించుకోవడం తదితర కారణాలతో నిరాశ, నిస్పృహలకు గురై వృద్ధులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. వారసుల నిరాధరణకు గురైన వయోవృద్ధులకు తమ అసోసియేషన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వృద్ధుల ఆత్మహత్యల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో గౌరిశెట్టి విశ్వనాథం, పీసీ హన్మంతరెడ్డి, బొల్లం విజయ్, ఎండీ యాకూబ్, పూసల అశోక్‌రావు, సతీశ్, మానాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

కథలాపూర్: బీఆర్‌ఎస్ కథలాపూర్ మండల అధ్యక్షుడు గడీల గంగప్రసాద్ తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. ఎనిమిదేళ్లు బీఆర్‌ఎస్‌లో పని చేశానని, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతర పరిణామాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. తక్కళ్లపెల్లి మాజీ సర్పంచ్ మొలిగె శ్రీనివాస్ కూడా బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.